
జీడిగుంట
రామచంద్రమూర్తి,
ఎమ్వీవీ శశిధర్




# అదే మనిషి అదే మనసు

హోటల్లో అడుగు పెట్టిన రాజశేఖరం ఎదురుగా గోడమీనున్న ఫోటో చూసి దిగ్భ్రాంతు డయ్యాడు. తన కాళ్ళ కింది నేల కరిగిపోతు న్నట్టు, తనను ఎవరో బలవంతంగా అగాధాల్లోకి లాగేస్తున్నట్టు అనిపిం చింది.

'ఇన్నేళ్ళుగా తాను మరిచిపోవటానికి ప్రయత్నించింది ఇందుకా?' అను కున్నాడు.

"అలాగే నిలబడి పోయారేం? రండి! కూర్చోండి!" హాలులోకి వచ్చిన పల్లవి మాటలు వినగానే గతం గది తలుపులు తెరవబోయిన మనసు ఆగి పోయింది.

"నమస్కారం! నేను. . ." చెప్ప బోతున్న శేఖరం మాటలకు అడ్డు వస్తూ, "తెలుసు! మీ విజిటింగ్ కార్డు చూశాను" అన్నది పల్లవి.

"విజిటింగ్ కార్డులోని పేరు గల

వ్యక్తిగానే గుర్తించా రన్నమాట!" రాజశేఖరం అన్నాడు, కొంచెం వ్యంగ్యాన్ని ధ్వనిస్తూ.

అతని వైపు క్షణం పాటు నిశితంగా చూసిన పల్లవి ప్రతిమలా నిలబడి పోయింది.

"మీరా. . . మీరు. . ."


"అవును! రాజశేఖరాన్నే! ఒకనాటి శేఖర్ని!"

అప్పటికే పల్లవి నుదుటి మీద చెమట బిందువులు ముత్యపు ముక్కల్లా నిలిచాయి.

"అయినా, నే నిప్పుడు రాజశేఖరంగా మీ ఇంటికి రాలేదు లెండి. . . రవి తండ్రిగానే వచ్చాను" అన్నాడు శేఖరం, సిగరెట్టు తీసి వెలిగించుకుంటూ.

పల్లవి పరిస్థితి ఇంకా అలాగే ఉంది. వెంటనే ఏమీ మాట్లాడ లేకపోయింది. కొన్ని క్షణాలకు ఎలాగో తేరుకుని, "కూర్చోండి!" అంటూ రాజశేఖరానికి సోఫా చూపించి, తను ఎదురుగా ఉన్న మరో సోఫాలో కూర్చుంది.

అంతకు ముందు విజిటింగ్ కార్డు తీసుకెళ్ళిన పనిమనిషి రెండు కప్పులతో కాఫీ తీసుకొచ్చి అక్కడున్న టీపాయ్



మీద పెట్టి వెళ్ళిపోయింది. ఓ కప్పును తీసి శేఖరానికి అందించి, "రాజశేఖరం అంటే ఎవరో అనుకున్నాను! మీరే నన్నమాట!" అని తేటి కప్పును పెదాలకు అద్దుకుంటూ అన్నది పల్లవి.

"నేనే అని తెలిసి ఉంటే ఒప్పుకునే వారు కాదా?"
ఆమె కళ్ళలోకి చూసి అడిగాడు.

ఆమె తల వంచుకుంది.

"ఇందులో భయపడవలసిందీ, సిగ్గు పడవలసిందీ ఏమీ లేదు. మీరు ఓ ఆడపిల్లకు తల్లి. నేను బాధ్యత కలిగిన ఒక తండ్రిని. ఎవరి వ్యక్తిత్వం వారి కుంది. ఎవరి హోదా వారి కుంది. ఇప్పటి కైనా మించిపోయింది లేదు. మా రవి కావాలంటున్నా, మీ కిష్టం లేకపోతే ఈ పెళ్ళి జరగదని నేను హామీ ఇస్తున్నాను." ఖాళీ అయిన కప్పును టీపాయ్ మీద ఉంచుతూ అన్నాడు.

పల్లవి బదులు చెప్పలేదు.

చివరి వరకూ కాలిన సిగరెట్‌ను ఆరిపారేసి మరో సారి పేర్చి ఏష్‌ట్రేలో వేసి, ఎదురుగా ఉన్న గోడ దగ్గరకు నడిచాడు రాజశేఖరం. దాని మీద నున్న ఫోటోలోకి చూస్తూ, "ఇది మీ పెళ్ళి ఫోటో కదూ? అయినా, మిమ్మల్నిలా చూడవలసివస్తుం దనుకోలేదు. ఇప్పుడు బిజినెస్ అంతా మీ అబ్బాయే చూస్తున్నా డనుకుంటాను" అన్నాడు.

"అవును! వాణ్ణి ఫారిన్ పంపించాలనీ, ఓ పెద్ద ఇంజనీర్ని చెయ్యాలనీ అనుకునే వారు వాళ్ళ నాన్న. కానీ, అర్ధాంతరంగా మా కన్నెయరిచేసి ఆయన కాస్తా వెళ్ళిపోయారు. అందుకే అబ్బాయిని చదువు మానిపించి వ్యాపారంలో పెట్ట వలసి వచ్చింది."

"ఇంకా పెళ్ళి చేయలేదా?"

"చెయ్యాలి. ముందు చెల్లెలి పెళ్ళి కావాలని పట్టుబట్టాడు. అదీకాక మీ రవీ, అమ్మాయీ ప్రేమించుకున్నారు కూడా."

"నిజమే! కానీ, ప్రేమించుకున్న వాళ్ళంతా పెళ్ళి చేసుకోవాలనీ, చేసుకుంటున్నారనీ ఎక్కడా లేదు!"

శేఖరం మాటలకు త్రుళ్ళి పడింది పల్లవి.

"మీ వారికి నాటకాలంటే ఇష్టం లేదనుకుంటాను." మళ్ళీ ఆ ఫోటోలోకి చూస్తూ అడిగాడు.

"ఎందు కలా అడుగుతున్నారు?"

"మరేం లేదు! నేను చాలా చోట్ల చాలా నాటకాలు వేశాను. వేయించాను. చూశాను. కానీ, ఏ ఆడిటోరియంలోనూ ఈయనను చూసిన గుర్తు లేదు" అంటూ మళ్ళీ వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

అతని వైపు ఒకసారి తీక్ష్ణంగా చూసి, "మీ రిప్పుడు ఈ ప్రస్తావన ఎందుకు తెచ్చారో నాకు తెలుసు!" అన్నది పల్లవి.

"అయితే, గతాన్ని మీరూ మరిచి పోలేదన్న మాట!" ఆమె మనసును చదవటానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

ఆమె నుంచి జవాబు లేదు. రాదని అతనికీ తెలుసు. కొన్ని క్షణాలు మరీ నిశ్శబ్దంగా గడిచి పోయాయి. ఆ లోటి నిశ్శబ్దాన్ని భరించలేక శేఖరమే ప్రస్తావన మారుస్తూ అడిగాడు:

"అమ్మాయి ఇంట్లో లేదా?"

"ఇంకా కాలేజీ నుంచి రాలేదు."

ఆమెతో సంభాషణ కొనసాగించటానికి అతని కెందుకో ఇబ్బందిగా ఉంది.

"ఇప్పుడు తిరిగి వెళ్ళటానికి నాకు బస్సు ఉంది. వెళ్ళనా మరి?" ఓ క్షణం ఆగి అడిగాడు.

## వయసు

కొందరు ముసలాళ్ళుగానే పుడతారు. కొందరు ఎప్పటికీ ముసలివారు కారు. మనం నవ్వుతూ, నవ్విస్తూ ఆనందంగా ఉంటే ఎప్పటికీ యువకులమే ... ఏళ్ళు పైబడ్డా, వృద్ధాప్యం రాదు. యువకులుగానే చనిపోవచ్చు.

—టమెన్ ఎడ్వర్డ్స్

ఆశ్చర్యపడింది పల్లవి.

"అదేం? అమ్మాయిని చూడకుండా వెడతారా?"

"అవును! తనకు అమ్మాయి నచ్చిందనీ, ఇద్దరూ కాలేజీలో చదువుకుంటున్నారనీ, అమ్మాయి వచ్చి తల్లి పోలికలేననీ రవి రాశాడు. కానీ, తల్లి పేరు పల్లవి అని రాసి ఉంటే అసలు నే నిలా వచ్చేవాణ్ణి కాదు."

"అంటే?"

"ఏ అందం. . . సారీ! మీ అందచందాలు నాకు తెలుసు కనక!" శేఖరం కామెంట్ విన్న పల్లవి ముఖంలో రంగులు మారిపోయాయి.

"చూడండి, పల్లవిగారూ! రవి నా కొడుకే కాదు. హి ఈజ్ మై ఫ్రెండ్! ఐ లవ్ హిమ్ సో మచ్! వాడంటే నాకు ప్రాణం. ఎన్నో బాధల్ని, గతం తాలూకు గాయాల్ని మరిపించాడు."

ఆ మాట అంటూంటే రాజశేఖరం కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"మరి మీ రంతగా ప్రేమించే మీ అబ్బాయిని మీ దగ్గరే ఉంచుకోక ఇక్కడ వదిలివున్నా రెందుకు?" అడిగింది పల్లవి.

"తల్లి లేని లోటుకూడా తెలియకుండా వాణ్ణి చాలా కాలం నా దగ్గరే పెంచి పెద్ద చేశాను. కానీ, రాను రాను నాకు బాధ్యతలు ఎక్కువయ్యాయి. విదేశాలలో నాటకరంగాన్ని పరిశీలించి రమ్మన్నారు ప్రభుత్వం వారు! అప్పుడే రవిని ఇక్కడ నా మిత్రుడు శ్రీనివాసరావు దగ్గర ఉంచ వలసి వచ్చింది."

"అయితే, మరి శ్రీనివాసరావు గారు మీ రవికి మేనమామ కాదా?" ఆశ్చర్యపోతూ అడిగింది పల్లవి.

చిన్నగా నవ్వాడు శేఖరం.

"ఆప్యాయత చూపించటానికి కేవలం బంధుత్వాలే అవసరం లేదండీ. శ్రీను నా ప్రాణమిత్రుడు! నా పెళ్ళి చెయ్యాలని ఒకప్పుడు మా అమ్మ కంటే ఎక్కువగా తాపత్రయపడ్డాడు. అందుకే మన పెళ్ళి జరగదన్న వార్త విన్నప్పుడు మీ అమ్మ గారితో మాట్లాడి ఒప్పించాలని ఆ నాడు బొంబాయికూడా వచ్చాడు."

"అవును. అప్పుడు మేము బొంబాయిలో ఉండేవాళ్ళం. అయితే, ఆ నాడు మా ఇంటికి వచ్చింది ఈయనే నన్నమాట! అమ్మ, ఆయనా ఘర్షణ పడుతూంటే నేను లోపలే ఉండిపోయాను ఆ నాడు. అందుకే ఆయనను నే నిప్పుడు గుర్తు పట్టలేక పోయాను."

"పోనీలెండి. గతం సంగతి ఇప్పుడెందుకు? ఇంతకీ మా రవి గురించి మీ అమ్మాయి అభిప్రాయం చెప్పలేదు" అన్నాడు శేఖరం ప్రస్తావన మారుస్తూ.

"చిన్నపిల్ల—అదేం చెబుతుంది? కానీ, 'అబ్బాయి నీకు నచ్చినట్టేనా?' అని నేను అడిగినప్పుడు సిగ్గుతో తల వంచుకుంది. పెళ్ళి చూపుల నాడు వాళ్ళిద్దరూ చాలా సేపు మాట్లాడుకున్నారుకూడా!"

"చాలా సేపు మాట్లాడుకున్నంత మాత్రాన ఒకరంటే మరి ఒకరికి సదభిప్రాయమూ, ఇష్టమూ ఉన్నాయనుకోవటం పొరపాటు. మన పెళ్ళి చూపులనాడు కూడా మనిద్దరం చాలాసేపు మాట్లాడుకున్నాం. ఆ తరవాత ఒక రోజు గార్డెన్స్‌కి కూడా వెళ్ళాం." గతంలోకి చూస్తూ అన్నాడు శేఖరం.

గతం గురించి మళ్ళీ మళ్ళీ మాట్లాడు కోవటం పల్లవికి ఇష్టం లేదు. అందుకే అడిగింది —

"మీ రిప్పుడు కలకత్తా లోనే ఉంటున్నారా?" అని.

"అనే అందరికీ చెబుతుంటాను. కానీ, నాటకాలాడే వాళ్ళకు ఓ చోటూ, ఓ ఊరూ ఏమిటి? ఎవరు రమ్మన్నా, ఎక్కడికి రమ్మన్నా వెళ్ళాల్సిందే! కానీ, బెంగాలీ కథలన్నా, వాళ్ళ నాటకాలన్నా నాకు చాలా ఇష్టం. అందుకే అక్కడ ఒక 'కళానిలయం' ఏర్పాటు చేశాను." మళ్ళీ మరో సిగరెట్టు తీసి వెలిగించాడు శేఖరం.

"మనం మళ్ళీ ఇలా కలుసుకోవటం మీకు వింతగా అనిపించటం లేదూ?" శూన్యంలోకి చూస్తూ అడిగాడు.

"నిజమే! చాలా విచిత్రంగా ఉంది. ఇన్నాళ్ళుగా రవి మా ఇంటికి వస్తున్నా, అతను మీ అబ్బాయని తెలుసుకోలేక పోయాను. పైగా మీరు నాకు 'శేఖర్' గానే గుర్తుండిపోయారు. 'రాజశేఖరం' అంటే ఓ మహా నటుడనీ, మంచి నాటక రచయిత అనీ విన్నాను. కానీ, ఒకనాటి రేడియో ఆర్టిస్టే నని గ్రహించలేదు." పల్లవి కళ్ళలో గర్వం తొణికిసలాడింది.

రాజశేఖరానికి గతం తాలూకు జ్ఞాపకాలు కళ్ళలోకి వస్తున్నాయి.

"అప్పట్లో గుమాస్తా ఉద్యోగం చేసుకుంటూనే రేడియోలో నాటకాలు వేసేవాణ్ణి. సమాజాలలో కలిసి చాలా ఊళ్ళు తిరిగి పోటీల్లో పాల్గొనేవాణ్ణి. నాలో ఉన్న ఉత్సాహానికి ఊపిరి పోశాడు నా మిత్రుడు శ్రీనివాసరావు."

"ఆయనకూడా నాటకాలు వేసే వారా?"

"కాదు; వేయించేవాడు. నాటకాలే వాడికి ప్రాణం. ఎన్నో ప్రదేశాలకు శిక్షణ కోసం పంపించాడు నన్ను. ఎన్నో రాత్రులు పక్కన కూర్చుని నాటకాలు రాయించాడు. నా కింతటి పేరు ప్రఖ్యాతులు వస్తున్నా, ఎంత డబ్బు గడిస్తున్నా అప్పుడప్పుడు నాలో ఎందుకో గాలి కెరటాలు చెలరేగేవి. నాకు తెలియకుండానే రాత్రిళ్ళు ఏడుస్తూ గడిపేవాడిని. అయినా, నా మనసులోని ఏడుపు కూడా వాడు వినగలిగేవాడు. నాకు ధైర్యం చెప్పేవాడు. ఒక్కొక్కరి జీవితంలోకి మరొకరు ఎందుకు ప్రవేశిస్తారో ఓ పట్టాన చెప్పటం చాలా కష్టం."

చెప్పటం ఆపి, పల్లవి వైపు చూశాడు శేఖరం.

పల్లవి తన వైపే తదేకంగా చూడటం గమనించి తల వంచుకున్నాడు. సగం కాలిన సిగరెట్టును పక్కన టీపాయ్ మీద ఉన్న ఏష్‌ట్రేలో వేశాడు.

మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు: " 'మ్యారేజెస్ ఆర్ మేడిన్ హెవెన్' అంటారు. కానీ, నన్నడిగితే — 'ఫ్రెండ్‌షిప్స్ ఆర్ మేడిన్ హెవెన్' అంటాను. ఆ రోజు నన్నొక నటుడుగా మలచటానికి అహోరాత్రాలూ కష్టపడ్డాడు శ్రీనివాసరావు. ఇప్పుడు నా రవిని తన దగ్గర ఉంచుకుని, కన్నకొడుకులా చూసుకుంటున్నాడు." తృప్తిగా నిట్టూర్చాడు.

"నిజమే! స్నేహబంధమంటూ ఏర్పడాలే కానీ, అంతటి మధురమైనటువంటి అనుబంధం మరొకటి ఉండదు. అందుకే సృష్టిలో తియ్యనిది స్నేహమే నంటారు."

"స్నేహబంధం తియ్యనైనదే కాదండీ! తీయలేనిదికూడా!" అన్నాడు శేఖరం, చిన్నగా నవ్వుతూ.

"అంతటి మంచి స్నేహితులు మీకు లభించటం మీ అదృష్టం" అన్న పల్లవి.

"అవును. నా కున్న అదృష్టమల్లా అదొక్కటే! వాడే నాకు ఉత్తరం రాశాడు- మీ అమ్మాయినీ, రవీ ప్రేమించుకున్నా రనీ, పెళ్ళిచూపులుకూడా పూర్తయ్యా యనీ, తండ్రిగా ఒక్కసారి వచ్చి అమ్మాయిని చూసి, ముహూర్త





పెరిగే పాపాయిలకు
రుచివంతమైన తోడు

బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు మరీ అంత ప్రత్యేకమైన రుచి గలిగి ఉండటానికి ఏమిటి కారణం? వాటిలో గల సమృద్ధినిచ్చే, సంపూర్ణమైన పుష్టినిచ్చే లక్షణాలే. పిల్లలకు యివి యిష్టం, పెరుగుతారు ఎంతో బాగా వాటితో. బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు ఎదిగే మీ పిల్లలకు ఎంతో మంచివి.

బ్రిటానియా
బిస్కట్లు అత్యుత్తమమైనవి

లింటాస్-BBC.GLX-6-140 TL

> **ఫలసాయం**
>
> యువకులు, చెట్లు ఒక్కటే. చెట్టు మొదటిసారిగా కాయలు కాచినప్పుడే, అది ఎలాంటి ఫలసాయం ఇచ్చేది తెలుస్తుంది. అలాగే యౌవనంలో అడుగు పెట్టి తొలి నాళ్ళలో ఏ ఆశయాలు, బుద్ధులు ఉంటాయో, జీవితం అంతా అవే ఉంటాయి
>
> — డెమోఫిలస్

పెట్టించి వెడితే బాగుంటుందని. బెంగుళూరు ప్రోగ్రామ్ కాన్సిల్ చేసుకుని వచ్చాను."

ఇంకా ఏదో చెప్పబోతూ "మమ్మీ!" అనే పిలుపు వినిపించి వెనక్కి చూశాడు శేఖరం. తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు.

సరిగ్గా పాతికేళ్ళ క్రితం పెళ్ళి చూపుల్లో తాను పల్లవిని చూసినప్పుడు అప్పుడు పల్లవి అచ్చం అలాగే ఉండేది. అవే కళ్ళు, అదే నుదురు. అదే చలాకీతనం!

"మా అమ్మాయి రేఖ." పల్లవి చేసిన పరిచయంతో వాస్తవానికి వచ్చాడు శేఖరం.

"నమస్తే!" తల కొంచెం వంచి, చిరునవ్వుతో నమస్కరించింది రేఖ.

ఆమె వైపు సాదరంగా చూశాడు శేఖరం.

"డ్రెస్ మార్చుకుని వస్తాను, మమ్మీ!" అంటూ లేడిలా తన గదిలోకి వెళ్ళిపోయింది రేఖ.

అదే గొంతు. పాతికేళ్ళ క్రితం పల్లవి గొంతుకూడా అంత మధురంగానూ ఉండేది. గతం గుర్తుకొచ్చిన శేఖరం కనుకొలకులలో కన్నీళ్ళు మరోసారి తొంగి చూశాయి.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? అమ్మాయి ఎలా ఉంది?" అడిగింది పల్లవి.

"నా అభిప్రాయం పాతికేళ్ళ క్రితమే చెప్పాను. కానీ, నా కెందుకో ఇప్పటికీ ఓ ప్రశ్నకు సమాధానం దొరకలేదు."

"ఏమిటి?" అన్నట్లు రాజశేఖరం వైపు చూసింది పల్లవి.

"అదే! మన పెళ్ళికి దాదాపు ముహూర్తంకూడా పెట్టబోయే సమయంలో మీ వాళ్ళు ఎందు కలా ప్రవర్తించారా అని! నేను నాటకాలు వేస్తాను—నిజమే! అంతమాత్రం చేత 'నాటకాలు వేసే కుర్రాడు మా కొద్దని ఎందుకన్నారు?"

"మా మేనమామకు నాటకాలాడేవా రంటే ఎందుకో సదభిప్రాయం లేదు. ఏవేవో సమాజాలను లేవదీసి, వేళకు ఇంటి పట్టున ఉండకుండా ఎక్కడెక్కడికో తిరుగుతూంటారనీ, వ్యసనాలకు బానిస లవుతారనీ ఆయన నమ్మకం. అందుకే మీ గురించి మా అమ్మకు లేనిపోనివన్నీ నూరిపోసి మన పెళ్ళి కాకుండా చేశాడు."

"మా మేనమామ నన్ను చూడాలని ఆ రోజు మా ఇంటికి వచ్చినప్పుడే అనుకున్నాను—ఆయన మామూలు మనిషి కాదని! అయినా, కాలేజీలో మగపిల్లలతో మీరు కలిసి చదువుకున్నారనీ, నాగరికత విచ్చలవిడిగా విహారం చేసే సిటీలో మీరు తిరిగారనీ నేనుకూడా అప్పుడు అని ఉంటే? కానీ, అనలేదు! అంటే అది మూర్ఖత్వ మవుతుంది. అనక పోవటం సంస్కార మనిపించుకుంటుంది." ఆవేశంగా అన్నాడు రాజశేఖరం.

అంతలోనే పనిమనిషి అక్కడకు వచ్చి ఖాళీ అయిన కాఫీ కప్పులు అక్కడినుంచి తీసుకుని వెళ్ళిపోయింది.

"ఆ నాడు ఏ పరిస్థితిలో మన పెళ్ళి ఆగిపోయిందో ఇప్పటికైనా మీరు అర్థం చేసుకున్నారు కనక నా మీద కోపం పోయిందనుకుంటాను" అన్నది పల్లవి.

"మీ మీద కోపం నా కెప్పుడూ లేదు. ఎటొచ్చీ నా మీద నాకే జాలి మిగిలిపోయింది ఈ నాటికీ!" విరక్తిగా నవ్వాడు. మళ్ళీ సిగరెట్టు మరొకటి తీసి వెలిగించాడు.

"మీరు సిగరెట్లు చాలా ఎక్కువ కాలుస్తా రనుకుంటాను" నవ్వుతూ అంది పల్లవి.

"మీ మామయ్యగారు చెప్పారుగా—నాటకా లాడేవాళ్ళు వ్యసనాలకు బానిస లవుతారని? ఎంతో అనుభవంతో చెప్పారనుకుంటాను. అన్నట్టు ఆయన కూడా నాటకాల్లో వేషాలు వేసేవారా ఎప్పుడైనా?" కాలుతున్న సిగరెట్టును పరిశీలనగా చూస్తూ అడిగాడు శేఖరం.

"లేదు. ఓ నాటకా లాడే కుర్రాడు మోసం చేసి, మామయ్య కూతుర్ని తీసుకుని లేచిపోయాడు."

"ఎవరో, ఎక్కడో నాటకాలు వేసే మనుషులు అసభ్యంగానూ, అనుచితంగానూ ప్రవర్తించారని అందరూ అలాంటి వారే అనుకున్నారు కాబోలు! వెనకటికి మీ మామయ్య లాంటి పెద్దమనిషే ఎక్కడో రైలు పట్టాలు తప్పి జనం చచ్చిపోయారని విని, ఇంకెప్పుడూ రైల్లో ప్రయాణం చేయకూడ దనుకున్నాడట"

"బాగా అన్నారు!" నవ్వేసింది పల్లవి.

"అసలు నన్నడిగితే ఏ వృత్తయినా పవిత్రమయినదే నంటాను."

"నిజమే! నాటక కళను అంత పవిత్రంగా ఎంచుకుని కృషి చేశారు కనకనే మీకు 'పద్మశ్రీ' బిరుదొచ్చింది. ఈ వేళ మీరు నాటకం రాసినా, వేషం వేసినా జనం విరగబడి చూస్తున్నారు. అప్పుడప్పుడు మీ గురించిన విశేషాలు పేపర్లో వచ్చినా, అందులో రాజశేఖరం అనే పేరు ఉండటం వల్ల మీరే అని నేను అనుకోలేకపోయాను."

అంతలోనే కాఫీ ట్రే తీసుకుని అక్కడకు వచ్చింది రేఖ. రాజశేఖరానికీ, పల్లవికీ కప్పులు అందించి, తానొకటి తీసుకుని తల్లి పక్కను కూర్చుంది.

"ఈయన రాజశేఖరంగారు— రవి నాన్నగారు."

రాజశేఖరాన్ని తన కూతురికికూడా పరిచయం చేసింది పల్లవి.

"మీ గురించి చాలా విన్నాను" అన్నది రేఖ, గౌరవభావంతో నవ్వుతూ.

"అలాగా? కానీ, విననివికూడా కొన్ని ఉన్నాయి" అన్నాడు రాజశేఖరం చలోక్తిగా.

అర్థంకాని రేఖ మర్యాదకు చిన్నగా నవ్వితే, అర్థం చేసుకున్న పల్లవి నవ్వలేక నిట్టూర్చింది.

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచి పోయాయి.

"నేను రవీంద్ర భారతికి వెడుతున్నాను, మమ్మీ! డాన్స్ ప్రోగ్రామ్ ఉంది. అన్నయ్యకు ఫోన్ చేసి కంపెనీ నుంచి తిన్నగా అక్కడకు వచ్చెయ్యమను. ఇద్దరం కలిసి వస్తాం" అంటూ తల్లికి చెప్పి, రాజశేఖరం దగ్గర సెలవు తీసుకుని వెళ్ళి పోయింది రేఖ.

"మరి, నాకూ సెలవిప్పిస్తే వెడతాను" అంటూ లేచాడు రాజశేఖరం.

"ఈ వేళ మీ స్నేహితుని ఇంట్లోనే ఉంటారనుకుంటాను" అంది పల్లవి.

"లేదు. మా ట్రూప్ బెంగుళూరు వెళ్ళింది. నేనూ రాత్రి బయలుదేరి వెళ్ళిపోవాలి. మీరు త్వరగా ముహూర్తం పెట్టించి రాస్తే పెళ్ళికి వచ్చి వాళ్ళిద్దర్నీ ఆశీర్వదిస్తాను."

"అలాగే. అయినా, రేఖ గురించి మీ అబ్బాయి అభిప్రాయం చెప్పలేదు." తనకూడా లేస్తూ అంది.

"పిల్లలు ఎప్పుడూ ఎగిరి గంతేసి, తమ అభిప్రాయాన్ని చెప్పలేరండీ! కొంతవరకూ వాళ్ళ మనసుల్ని చదవటం పెద్దవాళ్ళు—అందులోనూ— కన్నవాళ్ళు అర్థం చేసుకోవాలి."

"మొత్తానికి మీరు నాటకాల్లో మాటలు జీవితంలోకూడా బాగా ఉపయోగిస్తున్నారు!" చలోక్తిగా అన్నది.

"అవును! జీవితానికీ, నాటకానికీ పోలికలు కొన్ని ఉన్నాయి. నాటకంలోని ప్రతి సంఘటనకూ, సన్నివేశానికీ ఓ అర్థం, ఓ అంతరార్థం ఉండాలి! కానీ, జీవితానికి అలా అర్థాన్నీ, అంతరార్థాన్నీ కలిగించే సన్నివేశాలు మూడే మూడు ఉన్నాయి. మొదటిది—పెళ్ళి చూపులు; రెండోది—పెళ్ళి రోజు. ఇకపోతే మూడోది— మొదటి రాత్రి!" ఆ మాట అంటున్న రాజశేఖరం ముఖకవళికలు మారి పోయాయి.

అతని వైపే పరిశీలనగా చూస్తూ ఉండిపోయింది పల్లవి.

"నా జీవిత నాటకం మొదటి ఘట్టంతోనే ఆగిపోయింది. కనీసం నా రవి కయినా మిగిలిన అదృష్టాలు కలగనీయండి. అంతే నేను చెప్పదలుచుకున్నది."

"మీ రంటున్నది నాకు అర్థం కావటం లేదు. అంటే. . . అంటే. . . మీరూ. . ." ఏదో స్ఫురించి ఆగి పోయింది పల్లవి.

"నేను పెళ్ళి చేసుకోలేదు!"

"మరి. . . రవి?" ఆశ్చర్యం నుంచి తేరుకోనకుండానే ప్రశ్నించింది.

"ఒక అనాథ! మిమ్మల్ని ఎంతగానో ప్రేమించిన నేను మరొకర్ని పెళ్ళి చేసుకోదలుచుకోలేదు. కానీ, మనసులో చెలరేగే సుడిగాలుల నుంచి తప్పుకుని, కొంచెం మనశ్శాంతి పొందాలని అనాథాశ్రమం నుంచి ఆరు నెలల రవిని తెచ్చి పెంచుకున్నాను. అంతే! నా దగ్గర పదేళ్ళు పెరిగిన రవి తరవాత నా స్నేహితుడి దగ్గర పెరిగి పెద్దవాడయ్యాడు. నేను మాత్రం అదే మనిషిని! నాది మాత్రం అదే మనసు! వస్తాను!" అంటూ వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు రాజశేఖరం.

కన్నీటి పొరల లోంచి అస్పష్టంగా కనిపిస్తున్న రాజశేఖరాన్ని కనుమరుగయ్యే వరకూ చూస్తూ అలాగే ఉండిపోయింది పల్లవి. ★